# వయసు తలపుల తలుపులు

రూమ్‌కి తాళం వేసి రోడ్డు మీదకి రాగానే రాజేంద్ర కళ్ళు అప్రయత్నంగా ఎదురింటి కిటికీ వేపు మళ్ళాయి.

ఆమె అక్కడే నిల్చొనుంది!

ఈ కొత్త రూమ్‌లోకి వచ్చిన వారం రోజుల్నించీ తను గమనిస్తూనే వున్నాడు. సరిగ్గా తను ఆఫీస్‌కి బయల్దేరే టయిమ్‌కి ఆమె వచ్చి అక్కడ నిలబడుతుంది.....!

ఆమెను చూసి చిన్నగా నవ్వేడు.

ఆమె నవ్వింది.

చటుక్కున అతనికి తను రోడ్డుమీద నిలబడున్నాడనే విషయం స్ఫురణకి వచ్చింది. దాంతో బలవంతాన మనసుని అదుపులో పెట్టుకుంటూ ముందుకు నడవసాగాడు. అతని ఆలోచనలు మాత్రం ఆమె వేపే పరుగెడుతున్నాయి.....

తనా రూమ్‌లోకి వచ్చిన సాయంత్రం గేటు దగ్గర నిలబడ్డాడు పరిసరాల్నిగమనిస్తూ.

ఎదురింట్లో ఒకతను బయటికొచ్చేడు.

వెనుకే అతని భార్య అయుంటుంది.

అతనెంత నలుపో, ఆమె అంత తెలుపు.

కాకి ముక్కుకి దొండపండు!

అతని మీద ఈర్ష్య, ఆమె మీద జాలి ఒకేసారి కలిగాయి తనకి. అలాగే వాళ్ళని చూస్తూ నిలబడ్డాడు.

అతను-

కొద్ది అడుగులు వెనగ్గా ఆమె-

వెళ్తున్నారు.

వాళ్ళనే చూస్తూ తను......!

చటుక్కున ఆమె వెనక్కి తిరిగి చూసింది-వెళుతూనే!

తను రెడ్ హేండెడ్‌గా ఆమెకు దొరికిపోయాడనిపించింది. తక్కున లోపలికి వచ్చేశాడు. అయినా ఆమె గురించి ఆలోచించడం మాత్రం మాన్లేదు.

బహుశా పరిస్థితుల ప్రభావం వల్ల అతన్ని చేసుకొని వుంటుంది. అందుకే అతనితో జీవితానికి రాజీ పడలేకపోతోంది....


ఈ ఆలోచన ఆమె మీద జాలి, ఆమె భర్త మీద కోపం కలిగించడంతో పాటు తనకి ఆనందాన్ని కూడా కల్గించసాగింది.

తన నామె ఆకర్షించినట్లే, ఆమెని తనూ ఆకర్షించాడు. అందుకే అలా వెనక్కి చూసింది! ఆ క్షణంలోనే తనకామె మనసు అర్థమైపోయింది. అప్పట్నించి ఆమె రాజేంద్ర మనసులో తిష్ఠ వేసుక్కూర్చుంది. అందుకని అటుగా వచ్చేప్పుడు, పోయేప్పుడు అతని కళ్ళు అప్రయత్నంగా అటు చూస్తాయి.

రోజు రోజుకీ ఆమెకీ, తనకి మధ్య దూరం తరుగుతున్నట్లనిపించింది రాజేంద్రకి.

మొదటి రోజు వెనక్కి తిరిగి చూసింది.

రెండో రోజు కిటికీ దగ్గర నిలబడుతున్నదల్లా తనని చూస్తూపక్కకి తప్పుకుంది.



మూడో రోజా మనిషి పక్కకి తప్పుకోకుండా చూపుల్ని మాత్రం పక్కకిమరల్చింది...

నాల్గోరోజా తననే చూస్తూ నిలబడుంది. తనే కొద్దిగా కంగారు పడ్డాడు.....

అయిదోరోజా తనకి ధైర్యం వచ్చేసింది. చూపులు కలిశాయి....

ఇవాళ నవ్వులు విరిసాయి.....

ఇంక ఆలస్యమ్ అమృతమ్ విషమ్ అనిపించింది రాజేంద్రకి.

సాయంత్రం ఆఫీస్ నించీ పెందరాడే ఇంటికి వచ్చేయాలి. అప్పటికి ఆమె భర్త రాడు కాబట్టి ఆమెతో మాట్లాడే అవకాశం దొరుకుతుంది....

ఈ నిశ్చయానికి రాగానే అతని పెదవుల మీద నవ్వు విరిసింది.... మనసుకి సిగ్గేసింది. తియ్యటి ఆలోచన్లు మదిలో రొద చేస్తుంటే అతనికి తెలీకుండానే అడుగులు ముందుకు పడుతున్నాయి...

బస్టాప్‌కి చేరుకోగానే అతని ఆలోచన్లు చెదురు మదురు అయ్యాయి.

తోపిడి-త్రొక్కిసలాట - ఈ రోజా బస్సు ప్రయాణం అతనికి నరకంగా అనిపించలా.....

ఆఫీస్‌కి చేరుకున్న తర్వాత కూడా అతన్ని ఆలోచన్లు విడిచిపెట్టలేదు.... బలవంతాన గడపసాగాడు టైమ్‌ని - పని చేస్తున్నట్లు నటిస్తూ....

మూడు గంటలకల్లా పర్మిషన్ తీసుకుని బయటికి వచ్చాడు.

బస్సుకోసం ఎదురు చూడాలనిపించలేదు. ఆటోలో బయల్దేరాడు....

ఆటో ఆగగానే శబ్దానికి ఆమె బయటికి వచ్చింది. పిలుస్తున్నట్లుగా చెయ్యూపింది.

తననేమోనని తల మునకలైపోయాడు రాజేంద్ర.

కానీ ఇంతలో ఆటో వెళ్ళిపోవడంతో అవతల నిలబడున్న పక్కింటి కుర్రాడు కనిపించాడు.

ఆమె మళ్ళీ రమ్మన్నట్లు చెయ్యూపింది.

ఆ కుర్రాడటు పరుగెత్తాడు.

నీరసంగా కదిలాడు రాజేంద్ర.

రూమ్‌కి తాళం తీసి లోపలికి అడుగు పెట్టగానే "అంకుల్....." అంటూ పరుగెత్తుకొచ్చాడు ఇందాకటి కుర్రాడు.

"మీకు ఆ ఆంటీ ఈ కాగితాన్ని ఇమ్మన్నారు....." అంటూ చేతిలో ఓ కాగితాన్ని కుక్కేసి ఎంత వేగంగా వచ్చాడో, అంత వేగంగానూ వెళ్ళిపోయాడు.

వణుకుతున్న చేతుల్తో ఆ కాగితాన్ని విప్పేడు రాజేంద్ర.

"మా అయన వూళ్ళో లేరు.... మీరు చీకటి పడిం తర్వాత రండి. ఎదురు చూస్తూ వుంటాను....."

అతనికి ఇది కలా? నిజమా? అన్నంత అనుమానం వచ్చింది. మళ్ళీ మళ్ళీ ఆ వుత్తరాన్ని చదివేడు.

వెదకబోయినతీగకాలికితగిలింది.....

ఆనందంతో అతని మనసు గంతులు వేయసాగింది.

ఆ వుత్తరంతో పాటు మంచం మీద వాలిపోయాడు.

ఉత్తరం...

రంగుల కలలు...

ఎన్ని సార్లు ఉత్తరాన్ని చదివినా, ఎన్ని కలలు గన్నా టైమ్ గడవడం లేదు.

శుభ్రంగా స్నానం చేశాడు.

నీట్‌గా డ్రస్ చేసుకున్నాడు.

ఇంకా పొద్దు గూకలేదు....

నెమ్మదిగా నడుస్తున్న టైమ్‌ని తిట్టుకుంటూ వరండాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

మళ్ళీ ఆమె వాకిట్లోకి కూడా రాలేదు. బహుశా తనలాగానే ఆలోచన్లలో సతమతమై పోతోందేమో అనిపించిందతనికి.

సెకెండ్లు....

నిముషాలు....

గడుస్తున్నాయి బరువుగా.

చీకట్లు కమ్ముతున్నాయి.

రాజేంద్ర మొహం మాత్రం ఆనందంతో వెలిగిపోతోంది..... ఆలోచన్ల అలలు మాత్రం అతన్ని ఇబ్బంది పెట్టేస్తూనే వున్నాయి.....

"పట్టుకోండి... పట్టుకోండి," అరుపుల్తో వులిక్కిపడి బయటికి వచ్చాడు రాజేంద్ర.

ముందొకతను పరుగెత్తుకొస్తున్నాడు.

అతన్ని పట్టుకోవడానికి వెనక చాలామంది.

"పట్టుకోండి... పట్టుకోండి, దొంగ" అరుస్తున్నారు.

పరిస్థితి అర్థమైపోయింది రాజేంద్రకి.

చటుక్కున రోడ్డుమీదకి వురికి అప్పుడే అక్కడికి చేరుకున్న అతన్ని గట్టిగా పట్టేసుకున్నాడు....

ఇంతలో జనం చుట్టు ముట్టేశారు.

దొంగ చేతులు మారాడు.

ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు కొట్టసాగారు.

"ఎవరి వస్తువుల కోసమో ఆశపడక పోతే కష్టపడి పని చేసుకోకూడదూ....?"

"ఇటువంటి దొంగ బతుకు బతికేకన్నా చావడం నయం....."

ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు తిట్టసాగారు.

రాజేంద్రకి అక్కడ నిలబడాలనిపించ లేదు. రూమ్‌లోకి వచ్చేశాడు.

పోలీస్ స్టేషన్లో అప్పుడెప్పుడానికి కాబోలు దొంగని బలవంతాన లాక్కుంటూపోతున్నారు....

జనం, గోల క్రమంగా తగ్గింది.

రాజేంద్ర మనసులో కొత్త అలజడి రేగింది.

"దొంగ.... దొంగ...." అతని చెవుల్లో మారుమ్రోగుతోంది.

అతనికి, తనకి తేడా ఏమిటి?

ఈ ఆలోచన ఛెళ్లున చెంప మీద చరిచినట్లనిపించిందతనికి.

తనూ కొద్దిసేపట్లో ఎదురింట్లో దొంగతనానికి బయల్దేర బోతున్నాడు. తమ విషయాన్ని ఎవరైనా పసిగట్టేరంటే....?

తనూ ఇలాగే నలుగురి ముందూ అవమానాన్ని భరించాల్సి వుంటుంది. తనందుకు సిద్ధంగా లేడు.....

చటుక్కున కుర్చీలోంచి లేచాడు.

గబగబా రూమ్‌కి తాళం వేసి రోడ్డు మీదికి వచ్చాడు.

ఎదురింటి గుమ్మంలో ఆమె నిలబడుంది.

అటు వేపు చూడాలన్నా భయమనిపించింది రాజేంద్రకి. చరచరా ముందుకి వెళ్ళిపోయాడు - రోడ్ల మీద కాసేపలా అలా తిరిగివద్దామని! *

(జ్యోతి మాసపత్రిక - ఏప్రిల్ 1982)